## రఘునాథపల్లి సర్పంచ్ రిమాండ్

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 18 : రఘునాథపల్లి సర్పంచ్ పోకల శివకుమార్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ శ్రీనివాస్‌రావు సోమవారం తెలిపారు. రఘునాథపల్లి మండలం గిద్దెబండ తండాకు చెందిన మూడు లింబ అనే మావోయిస్టు 2008లో లొంగిపోవడంతో ప్రభుత్వం పునరావాసం కింద మండల కేంద్రంలో 300 గజాల ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేసింది. దీంతో ఇల్లు నిర్మించుకున్న అతడు 2018లో అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుమారుడు దేవేందర్ హైదరాబాద్‌లో ఉంటుండగా, భార్య, తల్లి అదే ఇంట్లో నివసిస్తున్నారు. ఈ ఇల్లును సర్పంచ్ శివకుమార్ ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలనే నిత్యం వారితో గొడవలు పెట్టుకున్నాడు. ఇల్లును ధ్వంసం చేయడం, కావాలనే ఇంటి పక్కనే బతుకమ్మలు వేయాలని గుంత తవ్వి, అందులో నీరు నింపడం చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. సర్పంచ్ వేధింపులపై దేవేందర్ గత నెల 2న పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఇటీవల ఏసీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ శ్రీనివాస్‌రావు చేపట్టిన దర్యాప్తులో నిజమని తేలడంతో సోమవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. గతంలో సర్పంచ్ శివకుమార్‌పై బైండోవర్ కేసు నమోదైంది. ఇప్పటి వరకు అతడిపై 25 కేసులు ఉన్నాయని ఏసీపీ తెలిపారు.

## మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం సవరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జనగామ జిల్లా నాయకులు అదనపు కలెక్టర్ పర్వార్ పింకేశ్ కుమార్ లలిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి చిరంజీవి మాట్లాడుతూ ఈ పథకం ధనికులకు మేలు జరిగేలా, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా ఉందని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు గల నిరుపేద మహిళలు, పురుషులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. రూ.1లక్ష లోపు వేతనం కలిగిన మహిళలకు ఈ పథకం నుంచి మినహాయింపు ఇవ్వాలని, దీంతో ఆర్టీసీకి నష్ట తీవ్రత కొంత తగ్గుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారికి ప్రతినెలా రూ.3వేల ఆర్థికసాయం ప్రభుత్వం అందజేయాలని కోరారు. డీఎస్పీ జిల్లా ప్రచార కమిటీ మెంబర్స్ కిష్టయ్య, ప్రశాంత్, ప్రవీణ్, రవి, బాబు, నవీన్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

## రిటైర్డ్ డీఈఓ మృతిపై సంతాపం

బచ్చన్నపేట, డిసెంబర్ 18: మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన రిటైర్డ్ పంచాయతీరాజ్ డీఈఓ కొప్పురపు కృష్ణారెడ్డి(80) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన పంచాయతీరాజ్‌శాఖలో పలు జిల్లాల్లో ఏఈగా పని చేసిన అనంతరం ప్రమోషన్‌పై డీఈగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందారు. అనారోగ్యానికి గురై మృతిచెందడంతో గ్రామంలో ప్రజలు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మృతుడికి భార్య చంద్రమ్మ, పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కృష్ణారెడ్డి, సర్పంచ్ శివరాత్రి కవితా రాజనర్సు, ఉప సర్పంచ్ బత్తిని రాజలింగం పరామర్శించారు.



కృష్ణారెడ్డి (ఫైల్)

## కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పాలకుర్తి, డిసెంబర్ 18: జాతీయస్థాయి కరాటే పోటీల్లో న్యూస్టార్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని న్యూస్టార్ కుంగ్‌ఫూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాటే మాస్టర్ గుగ్గిళ్ల దేవేందర్ సోమవారం తెలిపారు. ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో డీజిల్ కాలనీ వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన మూడో జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారన్నారు. ఈపోటీల్లో పాలకుర్తి బ్రాంచ్ విద్యార్థులు అండర్ 12, 14 కటాస్ స్పార్కింగ్ విభాగాల్లో ఈ రాకేశ్, పీ సాన్విక్ (గోల్డ్ మెడల్), బి.కృతిక, సీహెచ్ మణికంఠ, (బ్రాంజ్) మెడల్స్ సాధించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను గ్రాండ్ మాస్టర్ ఎండీ సలీమ్‌పాషా, మాస్టర్స్ అన్వర్, రామకృష్ణ, ధన్‌రాజ్, కోటేశ్వర్, విజేందర్, విశ్వనాథ్‌నాయుడు అభినందించారు.



కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ

## కళా ఉత్సవాల్లో జనగామ కళాకారులకు సన్మానం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తాడేపల్లిగూడెంలో ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక కళా ఉత్సవాల్లో జనగామ జిల్లాకు చెందిన కవులు, కళాకారులు లగిశెట్టి ప్రభాకర్, నాట్యాచార్యులు ఉప్పలోజు కిరణ్ కుమార్, మ్యాజిక్ ఆనంద్‌ను ఆ సంస్థ స్టేట్ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఘనంగా సన్మానించారు. వారిని పురప్రముఖులు, సాహిత్యాభిమానులు అభినందించారు.



# క్రిస్మస్ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: జిల్లాలో క్రిస్మస్ పండుగ వేడుకలు (డిసెంబర్ 25న) ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల క్రైస్తవ ప్రతినిధులు, ఆర్డీవోలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్‌ల (కొత్త బట్టలు) పంపిణీ, క్రైస్తవులకు విందు భోజనాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ, వారి సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం మూడు వేల క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్‌లను పంపిణీ చేయడంతోపాటు విందు భోజనం ఏర్పాట్ల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సూచించారు. చర్చీల వద్ద ప్రత్యేక అలంకరణతోపాటు ప్రార్థన మందిరాల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి సయ్యద్ ఇస్మాయిల్, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలు మురళీ కృష్ణ, రామ్మూర్తి, డీపీవో రంగాచారి, మున్సిపల్ కమిషనర్ (ఇన్‌చార్జ్) చంద్రమౌళి, క్రైస్తవ ప్రతినిధులు పసుల ఏబెల్, రాజ్‌కుమార్, థామస్, బాలస్వామి పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకలపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

## శివునిపల్లి గ్రామాభివృద్ధికి సహకరించాలి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 18: గ్రామంలోని సమస్యల పరిష్కారంతోపాటు గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రజలు, అధికారులను తాత్కాలిక సర్పంచ్ బూర్ల విష్ణు కోరారు. మండలంలోని శివునిపల్లిలో ఈ నెల 13న హైకోర్టు తీర్పు, కలెక్టర్ ఆదేశాలతో 8వ వార్డు సభ్యుడు బూర్ల విష్ణు తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. సోమవారం గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, పలు పార్టీ శ్రేణులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి సర్పంచ్, వార్డు సభ్యులు లేకపోవడంతో గ్రామం అభివృద్ధిలో కొంత వెనుకపడిందన్నారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకునేందుకు రోజూ రెండు వార్డులను పరిశీలించి సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేయాలన్నారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, బిల్ కలెక్టర్ సుమలత, వివిధ శాఖల అధికారులు, అంగన్ వాడి టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాత్కాలిక సర్పంచ్ విష్ణు



ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన కడవెండి జట్టు

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కడవెండి టీం ఫస్ట్

దేవరుప్పుల, డిసెంబర్ 18: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కడవెండి సెయింట్ జాన్‌డీ బ్రిట్టో ఉన్నత పాఠశాల టీమ్ విజేతగా నిలిచిందని పీఈటీ ఆంజనేయులు తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన 17 ఏళ్లలోపు విద్యార్థుల కబడ్డీ జట్లు అన్ని మండలాల నుంచి రాగా కడవెండి పాఠశాల టీమ్ విజేతగా నిలిచినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను జిల్లా టీమ్‌కు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ ఆంథోనీ స్వామి ఎస్‌వీడీ, ప్రొక్యూరేటర్ ఫాదర్ జయరాజ్ ఎస్వీడీ ఉన్నారు.

## సర్వే నంబర్ 174పై స్టేటస్‌కోను రద్దు చేయాలి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: బచ్చన్నపేట మండలం చిన్నరాంచర్ల శివారులో ఉన్న సర్వే నంబర్ 174పై ఉన్న స్టేటస్‌కో రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. స్టేటస్‌కోను రద్దు చేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ సర్వే నంబర్ 174లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమి 8 ఎకరాల 10 గుంటల స్థలాన్ని జడ్పీ వైస్ చైర్మన్ భర్త గిరబోయిన అంజయ్య ఆక్రమించుకున్నట్లు తెలిపారు. ఈ విషయంలో న్యాయపోరాటం చేసిన రిటైర్డ్ ఎంపీడీవో నల్ల రామకృష్ణను సుపారి గ్యాంగ్‌తో హత్య చేయించారని ఆరోపించారు. ఈ ఘటనకు సదరు భూమిపై ఉన్న స్టేటస్‌కోను రద్దు చేయకపోవడమే కారణమని తెలిపారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలు, సీపీఎం నాయకులు 73 మందిపై కేసులు పెట్టి జైలుకు పంపించారని పేర్కొన్నారు. మరో పది రోజుల్లోగా జిల్లా కలెక్టర్ ఆ స్థలానికి సంబంధించిన స్టేటస్‌కోను రద్దు చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా నాయకులు సుంచు విజేందర్, వెంకటేశ్, నర్సింహులు, వెంకటమ్మ, యాదగిరి, రాజవ్వ, బుచ్చమ్మ, బాలరాజు, యాదగిరి, నరేశ్, కరుణాకర్, అర్చన, కవిత, యాదయ్య, శోభ, లక్ష్మి, పద్మ, కలమ్మ, సుమలత, మల్లయ్య పాల్గొన్నారు.



కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా నాయకులు

## ఒగ్గు రవికి డాక్టరేట్

లింగాలఘనపురం, డిసెంబర్ 18: మాణిక్యపురానికి చెందిన ఒగ్గు రవికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను ప్రకటించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు ఈ పట్టాను సోమవారం జరిగిన కార్యక్రమంలో రవికి అందించారు. లలిత కళాపీఠం రంగస్థల కళలశాఖలో డాక్టర్ కోట్ల హన్మంతరావు పర్యవేక్షణలో 'ఒగ్గుకథ-నాటకీయ లక్షణాలు' అనే అంశంపై రవి విస్తృత పరిశోధన జరిపి సిద్ధాంత గ్రంథాన్ని అందించగా ఈ డాక్టరేట్ లభించింది.



వీసీ చేతులమీదుగా డాక్టరేట్ పట్టా అందుకుంటున్న ఒగ్గు రవి

# లింగాలఘనపురంలో డీపీవో విచారణ

లింగాలఘనపురం, డిసెంబర్ 18: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ వివాదంపై డీపీవో రంగాచారి సోమవారం విచారణ జరిపారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయాన్ని పునరుద్ధరిస్తుండగా, గుడి పక్కనే నివసిస్తున్న ఆకుల నరసింహులు ఆ స్థలం తనదని, అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాల్సిందిగా హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నాడు. దీంతో కలెక్టర్ శివలింగయ్య ఆదేశించడంతో డీపీవో క్షేత్రస్థాయి విచారణ జరిపారు. హైకోర్టులో 5-108/4లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొనడంతో డీపీవో గ్రామపంచాయతీ రికార్డులతో వచ్చి పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ నరసింహులు తెచ్చుకున్న హైకోర్టు స్టేలో 5-108/4లో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఉన్నట్టు తెలిపారు. వాస్తవానికి అతడు నివసిస్తున్న గృహమే 5-108/4 అని తేలిందని, అక్రమ నిర్మాణాలు జరుగడంలేదని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. ఎంపీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కారోబార్ బోయిని సురేశ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గవ్వల మల్లేశ్, నాయకులు ఇటికల చందు, పుల్కరం నాగరాజు, బోయిని వెంకటేశ్, శ్రీకాంత్, మేడె తిరుమల్, కుంటి భీములు, గట్టగల్ల ఎల్లయ్య, బాకి మల్లయ్య, పగిడిపల్లి ఆంజనేయులు, ఇటికల సత్యనారాయణ పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డీపీవో రంగాచారి